తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ఆలయ ఈఓచే నిత్యాన్నదానం తనిఖీ



కాణిపాకం, డిసెంబర్ 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలు చేస్తున్న నిత్యాన్న దాన కార్యక్రమంను ఆలయ నూతన ఈఓ పెంచల కిషోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలయ ఈఓగా పెంచల కిషోర్ శుక్రవారం నూత నంగా బాధ్యతలు స్వీకరించిన పెంచల కిషోర్ శుక్రవారం అన్నదాన భవన్‌కు చేరుకుని పరిశీలి ంచారు. అన్నదాన భవన్‌లో ప్రతి ఎంతమందికి భోజనవసతి కల్పిస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. అలాగే భక్తులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను, అన్నదాన భవన్ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆయన భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు శుచి,శుభ్రతతో కూడిన అన్నప్రసాదాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యమంటూ షార్‌లో 5కె రన్



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 7 ప్రభాతవార్త : శ్రీహరి కోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం ఉద్యోగులు శనివారం ఉదయం 5కె రన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఆరోగ్యమే మహాభాగ్యమంటూ ప్రతి ఏడాది షార్‌లో ఈ కార్యక్రమాలు జరుపు కుంటారు. ఈ ఏడాది ఉద్యోగులు, సిఐఎస్‌ఎఫ్ దళాలు కలిసి ఈ ఇంటిగ్రిటి రన్ పేరుతో కార్యక్రమం జరిపారు. జీరో పాయింట్ లోని సతీష్‌ధవన్ విగ్రహం నుంచి స్పేస్ సెంట్రల్ స్కూలు దాకా ఉద్యోగులు, సిఐఎస్‌ఎఫ్ దళాలు కలిసి పరుగులు తీశారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శంకరన్, శంభుప్రసాద్, రవికుమార్, సిఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెండ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన విజేతలకు బహుమతులు పంచిపెట్టారు.

### తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే...

# విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**- ఉపాధ్యాయులు బోధనతో పాటు విద్యార్థుల సత్‌ప్రవర్తనపై దృష్టి**
**- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్‌లు**

బంగారుపాళ్యం, పూతలపట్టు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అన్నారు. బంగారుపాళ్యం జడ్పీ ఉన్నత పాఠశాల, పూతలపట్టు మండలం పి.కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థు లకు విద్యాబోధనతో పాటు పాఠశాలలో వారి ప్రవర్తనపై దృష్టి పెట్టాల్సి న అసవరం వుందన్నారు. ఉపాధ్యయులు పాఠశాలల్లో విద్యార్థుల పూర్తి బాధ్యత తీసుకుని విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, విద్యార్థులు వెనుకబడి వున్న సబ్జెక్టులపై మరింత దృష్టి సారించి వారి విద్యా ప్రమాణాలను పెంచాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తే వారిని భవిష్యత్తులో ప్రయోజకులుగా చూడవచ్చునన్నారు. ప్రభుత్వ పాఠశాల పట్ల తల్లిదండ్రులకు భరోసా కలిగించేలా విద్యా బోధన ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మౌళిక వసతులు కల్పిం చడం జరిగిందని, మంచి వాతావరణ పరిస్థితులు మధ్య విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి సాధనలో రాష్ట్రంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పోటీ నెలకొని వుందన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు నెగ్గాలంటే విద్యార్థులకు బాల్యం నుండి భవిష్యత్తు మంచి బాట ఏర్పాటుకు దిశా నిర్దేశం చేయవలసిన అవసరం ఉపాధ్యాయులకు వుందన్నారు. పేరెంట్, టీచర్ మాటింగ్‌ను కనీసం నెలలో ఒకరోజు నిర్వహిస్తూ విద్యార్థుల విద్య, ఆరోగ్య ప్రవర్తన వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అలాగే తల్లిదండ్రుల నుండి సలహాలు స్వీకరించాలన్నారు. విద్యార్థులకు సత్‌ప్రవర్తన, మెరుగైన విద్యాబోధనలు అలవాటు చేయడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. తల్లిదండ్రుల్లో చాలా వరకు నిరక్షరాస్యులు వుంటారని, వారి పిల్లల విషయంలో సమస్యలను వివరించే సమయంలో ఉపాధ్యాయులు సావధానంగా విని తల్లిదండ్రులతో సయోధ్యతో మెలగాలన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులను తమ ఇంటి మనిషిగా భావించి సమస్యలను వివరించాలన్నారు. బంగారుపాళ్యం జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం ఇన్‌ఛార్జి ఎంపిడిఓ శ్రీధర్, తహసిల్దారు రాజేంద్రప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, హెడ్మాస్టర్ రాజేంద్ర,



బంగారుపాళ్యం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## దిగువమాఘంలో రిఫ్రిజిరేటర్ పేలి వ్యక్తి మృతి!

తవణంపల్లె, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఇంట్లో వున్న రిఫ్రిజిరేటర్ తీవ్రగాయాలకు గురై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దిగువమాఘం గ్రామంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది సంఘటనకు సంభందించి గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. దిగువమాఘం గ్రామంలో సీతారామయ్య, భానుమతి దంపతులు కాపురముంటు న్నారు. వీరు యధావిధిగా ఉదయం సుమారు 6 గంటలకు నిద్రలేవగా సీతాంరామయ్య వేడి నీళ్ళు కాచుకునేందుకు కిచెన్‌లోకి వెళ్ళాడు. కిచెన్‌లో వున్న లైట్ వేయగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కిచెన్‌లో వున్న రిఫ్రిజిరేటర్ ఒక్కసారిగా వేలి పోయింది. దీనితో రిఫ్రిజిరేటర్‌లోని గ్యాస్ లీకై మంటలో అంటుకోవడంతో సీతారామయ్య తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇతన్ని గ్రామస్థులు వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ప్రమాద సమయంలో సీతారామయ్య భార్య భానుమతి బాత్‌రూంకు వెళ్ళడంతో ప్రమాదం నుండి బయట పడింది. ఈపేలుడుకు ఇల్లు ధ్వంసం కాగా ఇంటిలోని వస్తువులు కాలిపోయాయ .



రిఫ్రిజిరేటర్ పేలిపోవడంతో ధ్వంసమైన ఇల్లు

విద్యార్థులను తీర్చి దిద్దటం ఉపాధ్యాయుల వంతు...

## పాఠశాలకు పంపటం తల్లిదండ్రుల బాధ్యత

**-గ్రామీణులతో మమేకమైన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్**



విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటం ఉపాధ్యాయుల వంతు అని వారిని సుశిక్షిత పౌరులుగా తీర్చిదిద్దుటకు పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా పెరెంట్స్ మీట్ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ శ్రీకాళహస్తి మండలం తొండమ నాడులో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రు లతో, ఉపాధ్యాయులతో, గ్రామస్థులు, అధికారులతో మమేకమయ్యారు. ఆనందోత్సాహాలను వారితో పంచుకున్నారు. ఆటలు ఆడారు. తాడు లాగారు. విద్యార్థులతో కలసి భోజనం చేసారు. ఓ మంచి స్నేహితునివలె విద్యార్థుల తల్లిదండ్రులకు సందేశాన్ని ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయుల బాధ్యతను సునిశితంగా వివరించారు.ప్రభుత్వం ఓ మహోన్నతమైన లక్ష్యంతో మెగా పెరెంట్స్ సమావేశం ఏర్పాటు చేసారన్నారు. విద్యార్థుల పఠనా సామర్థ్యం,వారి ఆసక్తులు, ఆరోగ్యంపై తల్లిదండ్రులకు, గురువులకు అవగాహన కల్గి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహించుటకు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ద నిధులు కేటాయించారని వివరించారు. యువకులైన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు చక్కటి అవగాహన ప్రణాళికలున్నాయని కలెక్టర్ ప్రజలకు వివరించారు. ఈ సందర్బంగా ఆయన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడు తూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల ఆసక్తిని,శ్రద్ధను బట్టి చదివించాలన్నారు. ప్రతిభా పాటవాలున్నపుడు ఏ రంగంలో అయినా రాణిస్తారన్నారు.అలా కాకుండా తాము కోరుకున్న సబ్‌జెక్టునే తమ పిల్లలు చదవాలంటే రాణించరన్న అంశాన్ని ప్రతి తల్లిదండ్రి గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థికి హెలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును అందించి అందులో విద్యార్థి తల్లిదండ్రుల వివరాలు విద్యార్థుల అభిరుచులను నమోదు చేయటం ఓ శుభ పరిణామన్నారు.పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులతో కలసి డొక్కా సీతమ్మ బడి భోజనంలో కలెక్టర్ ఓ సామాన్య తల్లిదండ్రిలా భోజనం చేసారు.ఇక్కడి సమావేశంలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలసి కలెక్టర్ ఓ విద్యార్థిలా టగ్‌ఆఫ్ వార్,తాడు లాగుడు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్బంగా విద్యార్థుల తల్లిదండ్రులు తారక్ తల్లి శ్వేత,కె.దీపిక తండ్రి కె.గురవయ్య, విద్యాకమిటి ఛైర్మెన్ అచ్చుత రావులను మాట్లాడించారు.ఈ పండగ వాతావరణంలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కుమార్, మండల ప్రత్యేకాధికారి చెన్నయ్య, డిఎంహెచ్‌ఓ శ్రీహరి, ఎంపిడిఓ రఫీక్‌ఖాన్, ఎఇఓ భువనేశ్వరి, సిడిపిఓ దుర్గా, శ్రీకాళహస్తి తొండమనాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష,తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు...

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-డి.ఆర్.ఓ నరసింహులు, విభిన్న ప్రతిభావంతులుశాఖ సహాయ సంచాలకులు ఏ.వై. శ్రీనివాస్**

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:విభిన్న ప్రతిభా వంతులు ప్రభుత్వ మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని డి ఆర్ ఓ నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు విభిన్న ప్రతిభావంతుల వృద్ధులు, హిజ్రాల, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఇతరుల మీద ఆధారపడకుండా వారి స్వయం కృషితో జీవించాలనేదే ప్రభుత్వ యొక్క ఆశయమని ఇందుకోసం ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, జిల్లా యంత్రాంగం తరపున విభిన్న ప్రతిభావంతులకు అన్ని సదుపాయాలను అందించడం జరుగుతుందని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో కూడా ప్రతిభా వంతులు ఉన్నారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని మీ అందరికీ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. విభిన్న ప్రతిభవంతులు శాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ విభన్న ప్రతిభావంతుల సమిష్టి , స్థిరమైన భవిష్యత్తు కోసం, వైకల్యం ఉన్న వారి నాయకత్వాలను విస్తరించడం వారికి జీవన ప్రమాణాలను మెరుగు పరచడంకోసం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో మనకు ముందుగా కనిపించే వైకల్యం కళ్ళు, కాళ్లు, చేతులు లేకపోవడం వంటి వారే కాకుండా శారీరిక, మానసిక వైకల్యం కలిగిన వారు, దృష్టి వైకల్యం, వినికిడి లోపం మానసిక ఆరోగ్యం, తల సేమియా వంటి తదితర 21 రకాల విభిన్న ప్రతిభావంతులు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ లీడర్లు మాధవ, మురళి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, విజయలక్ష్మి, సుబ్రమణ్యంరెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధికారులు

### పేరెంట్స్ మీటింగ్...

# స్పందన తగ్గిన వైనం

**-నగరంలోని 69 పాఠశాలల్లో జరిగిన సమావేశాలకు 5,242 మంది హాజరు.**
**-40శాతం మాత్రమే హాజరైన తల్లిదండ్రులు -సామర్థ్యాలపై ఉపాధ్యాయులతో చర్చ**
**-తిరుపతిలో ముగిసిన పేరెంట్, టీచర్స్ సమావేశం**

తిరుపతి విద్య,డిసెంబర్ 7 ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గ పరిధిలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ముగిసింది. ఈ సమావేశాలకు 40శాతం మంది పేరెంట్స్ హాజరయ్యారు.తిరుపతి అర్బన్ ప్రాంతంలోని 69 పాఠశాలలో సుమారు 12,145 మంది విద్యార్థులు ఉండగా అందులో కేవలం 5,242మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరయ్యారు. సుమారు 12 పాఠశాలల్లో కేవలం 10శాతం మంది పేరెంట్స్ మాత్రమే హాజరు కావడంతో ఉపాధ్యాయులు తూతూ మంత్రంగా సమావేశాలను ముగించారు. 28 పాఠశాలల్లో ప్రభుత్వ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. విద్యార్థుల సామర్థాలపైన, పాఠశాలలలోని మౌళిక సదుపాయాలపైన ఉపాధ్యాయులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి పండుగ వాతావరణాన్ని తలపించేలా అధికారులు సమావేశాలను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమావేశాలకు హాజరుకాక పోవడంతో సర్వత్రాచర్చకు తెరలేసింది. ఎమ్‌ఎమ్ పాఠశాలలో జరిగిన సమావేశానికి నగరపాలక కమిషనర్ మౌర్య హాజరుకాగా,నగరంలోని మున్సిపల్ స్కూల్లో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌కు మేయర్ డాక్టర్ శిరీష హాజరై సమస్యలపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

### పాతికేళ్ళ క్రితం...

## ఎస్.ఎస్.కెనాల్‌కు భూములు తీసుకున్నారు!

**-22ఏ కింది మిగిలి భూములకు డికెటిలకు పట్టాలు ఇవ్వలేదు**
**-ఇప్పటి వరకు తమకు నష్టపరిహారం అందించలేదన్నారు**
**-వెల్లంపాడు రెవెన్యూ సదస్సులో బాధితులు**

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడు గ్రామంలో శనివారం ప్రభుత్వం ప్రకటించిన రెవెన్యూ సదస్సులకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి తహశీల్దార్ లక్ష్మీనారాయణల సారధ్యంలో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుల్లో రైతులకు సంబంధించిన సమస్యలపై చక్కగా చర్చించారు. దీర్ఘకాలిక సమస్యలపై రైతులు, ప్రజలు అందించిన ఆభ్యర్థనలపై అధికారులు, ఎంఎల్‌ఏ స్పందించారు. ముఖ్యంగా ఎస్ ఎస్ కెనాల్‌కు పాతికేళ్ళ క్రితం భూములను అందించిన రైతుల మొరను అధికారులు ఆలకించారు. నాడు సామాజిక కార్యక్రమాలంటూ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అభ్యర్థించటంతో భూములను అప్పగించామన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నష్టపరిహారం అందించలేదన్నారు. భూములు కొల్పోగా మిగిలిన భూములకు సెక్షన్ 22ఏ కింద నమోదు చేసి తమ భూములను వినియోగించుకునే అవకాశం లేకుండా చేసారని రైతులు అధికారులు, నాయకునికి వివరించారు. కాగా సుమారు 30మంది రైతులు డికెటిలను దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్నారని, కానీ తమకు పట్టాలు ఇవ్వలేదని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇలాంటి సదస్సులవల్ల సమస్యలు పరిష్కారమౌతాయని అధికారులు అందు బాటులో ఉంటారన్నారని జనం అభిప్రాయపడ్డారు. కొందరు ప్రజలు డిజిటల్ సంతకాలు పని చేయటం లేదని ఫిర్యాదు చేసారు. ఈ సమస్యలపై స్పందించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసే లక్ష్యం గ్రామాల్లోనే అక్కడిక్కడే రెవెన్యూ సమస్యలను పరిష్కరించ బడాలనే లక్ష్యంతోనే రూపకల్పన చేసారన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోనే మారు మూల ఉన్న గ్రామం వెల్లంపాడులో ఏర్పాటు చేయటం అభినంద నీయం. అధికారులు రైతులు విన్నవించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డితో పాటు ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీనారయణ,మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,తాటిపర్తి ఈశ్వరరెడ్డి, బొల్లినేని జగన్నాధంనాయుడు,చెలికం పాపిరెడ్డి, బత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

## ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోనే దేశానికి మంచి పౌరులు

**- పిల్లల కోసం కొంత సమయం కేటాయింపు - జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ**




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిత అధికారి

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: దేశానికి ఉపయోగపడే మంచి పౌరులు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులపై వుందని జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ అన్నారు. చిత్తూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల, ఎపి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో జిల్లా సాంఘీక సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ గురుకులంలో చదువుతున్న పిల్లల ప్రోగ్రెస్, వారి సైకాలజీతో పాటు వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై వుందన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం పునరంకితం కావాలని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని, పిల్లలను చదువు వైపు ప్రోత్సహించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మంచి మౌళిక సదుపాయాలు వున్నాయని, ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, జిల్లా స్థాయి అధికారులు, దాతలు పాల్గొనడం వల్ల పాఠశాలకు సంబంధించి అనుకూల, ప్రతికూల సూచనలు, సలహాలు అందజేయడంతో పాటు విద్యార్థుల్లో ఒక స్ఫూర్తి నింపడం జరుగుతుందన్నారు. గురుకులంలో చదివే పిల్లల తల్లిదండ్రులు వారి కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. అప్పులు పిల్లల ప్రోగ్రెస్, వారి సైకాలజీ, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసు కోవడానికి అవకాశం వుంటుందన్నారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ళు ఆర్.అరుణ, రేఖలు, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఎన్.మూర్తి, గురుకులం టీచర్లు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్లు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

## శ్రీసిటీలో 'ఈ ప్యాక్' పరిశ్రమ విస్తరణకు భూమిపూజ

**ప్రముఖ హైస్సెన్స్ కంపెనీతో భాగస్వామ్యంతో ప్లాంటు నిర్మాణానికి శ్రీకారం**



శ్రీసిటీలో నూతన ప్లాంటు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సత్యవేడు, డిసెంబరు 7 ప్రభాతవార్త: శ్రీసిటీలోని ఈ ప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ (ఈడీఎల్) పరిశ్రమ, తమ అధునాతన అదనపు ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. గృహోపకార పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఏసీల తయారీలో గ్లోబల్ లీడరైన హైస్సెన్స్ సంస్థతో వ్యాపార భాగస్వామ్యంలో భాగంగా నూతన ప్లాంటు నిర్మాణాన్ని ప్రారంభిం చింది. ఈ కార్యక్రమంలో ఈ ప్యాక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అజయ్ సింఘానియా, డైరెక్టర్ ఎల్‌బీ బోత్రా, హైస్సెన్స్ ఇండియా సీఈవో పంకజ్ రాణా, మేనేజింగ్ డైరెక్టర్ స్టీవెన్‌లీ పాల్గొన్నారు. హైస్సెన్స్ సంస్థ రూపొందించిన సాంకేతికత, డిజైన్‌ల మేరకు ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్‌లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర చిన్న చిన్న గృహోపకర వస్తువుల ఉత్పత్తికి అవసరమైన తయారీ లైన్లను ఈ నూతన ఉత్పత్తి కేంద్రంలో నిర్మించడం జరుగుతుంది. భారతదేశంలో హైస్సెన్స్ ఉనికిని బలోపేతం చేయడం, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడం లక్ష్యంగా ఈ ప్యాక్ పాత, కొత్త ప్లాంట్లు పని చేయనున్నాయి. భూమిపూజ కార్యక్రమంలో అజయ్‌సింఘానియా మాట్లాడుతూ ఈ ప్యాక్ ప్రయాణంలో ఇదో మైలురాయికాగా మేక్ ఇన్ ఇండియా చొరవకు అనుగుణంగా దేశీయ తయారీని ప్రోత్సహించడంలో తమసంస్థ నిబద్ధతనఉ ఇది బలపరుస్తుందన్నారు. నూతన ఆవిష్కరణలు, నాణ్యత, స్థిరత్వంపై దృష్టి సారించి ప్రపంచ స్థాయి హైస్సెన్స్ ఉత్పత్తుల తయారీకి నూతన ప్లాంటు సహకరిస్తున్నారు. రూ.91 కోట్ల పెట్టుబడితో 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్యాక్ అదనపు ప్లాంటు నిర్మాణం చేపట్టగా, జూన్ 2025 నాటికి ఉత్పత్తులు ప్రారంభం కావచ్చని అంచనా. రెండు ప్లాంట్లతో ఎయిర్ కండీషనర్ల ఉత్పత్తి సామర్థ్యం 2 మిలియన్ యూనిట్లకు పెరుగుతుంది. ప్రస్తుతం ఈ ప్యాక్ పరిశ్రమలో 700 మంది పని చేస్తుండగా, నూతన ఉత్పత్తి కేంద్రంతో మరో 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనుంది.

## విద్యార్థులను చూసి బాల్య దశ గుర్తొచ్చింది

### సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వాకాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త



ఈ విద్యార్థిని విద్యార్థులను చూసి నా చిన్ననాటి చదువు, జ్ఞాపకాలు గుర్తొచ్చింది అని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. శనివారం వాకాడు ఎస్ ఎ ఎల్ సి ప్రభుత్వ పాఠశాలలో ఆత్మీయ పేరెంట్స్ డే కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దశలోనే చదువు మీద శ్రద్ధ చూపాలని తెలిపారు, విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు, ఉన్నత చదువులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందన్నారు, విద్యార్థిని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు చేసి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు, అదేవిధంగా పాఠశాల చదువుకున్నందుకు ఉపాధ్యాయులకు కూడా మంచి పేరు తీసుకురావాలన్నారు. అదేవిధంగా మండలంలోని ఉన్న 72 పాఠశాలలో ఆయా ప్రధాన ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, సన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ నేసిం అలీ, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాల పెంపులో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపులో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల హైస్కూలులో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ఇందుకు తగ్గట్టుగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కీలక భూమిక పోషిస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత రేటు పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజె కిషోర్, జనసేన నాయకులు పొన్నా కటయ్య, బిజెపి నేత ఆదినారాయణరెడ్డి, నలబోయిన రాజసులోచనమ్మ, ఎంపిడిఓ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఓ కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## మాంబట్టులో రెవెన్యూ సదస్సు

తడ, డిసెంబర్ 7 ప్రభాతవార్త

తడ మండలం మాంబట్టులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చినమాం బట్టులోని శివాలయం వద్ద ఉన్న కల్యాణ మండపంలో జరిగిన ఈ సదస్సుకు పెదమాంబట్టు, చినమాంబట్టు, ఎన్‌ఎం కండ్రిగ, వివిధ కాలనీల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలోని భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు. తహశీల్దార్ శరత్‌తో పాటు విఆర్ఓ చలపతి, వలువురు అధికారులు, సర్పంచ్ రమణయ్య, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కాసింగాడు కుప్పంలో ఘనంగా మెగా పేరెంట్స్‌డే

తడ, డిసెంబర్ 7 ప్రభాతవార్త



తడ మండలం కారూరు పంచాయతీ పరిధిలోని కాసింగాడుకుప్పంలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపియూపి స్కూల్లో జరిగిన కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఎంపిపి కొళవి రఘురెడ్డి, ఎంపిడిఓ ఎన్.విజయకుమార్, ఎంఇఓ మల్లికార్జునరావు, ఆంజాకం జీవా, మునిరాజా, నీలకంఠం, కళానిధి తదితరులతో పాటు కాసింగాడుకుప్పం, బాలక్రిష్ణాపురం కుప్పం పాఠశాలల ఉపాధ్యాయులు రఘురామయ్య, కరిముల్లా, సుధా, సుబ్రహ్మణ్యం, తిరుపతి, దాసు పాల్గొన్నారు.

## కల్లూరులో రెవెన్యూ సదస్సు

వాకాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

వాకాడు మండలం కల్లూరు, కోడివాక గ్రామాలలో శనివారం తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో కల్లూరు గ్రామంలోని భూ సమస్యల పరిష్కారం కోసం13 అర్జీలు వచ్చాయని, గృహ నివాస స్థలాల కోసం ఒకరు, సర్వే కోసం ఐదురు అర్జీలు వచ్చాయని అన్నారు, అదేవిధంగా కోడివాక గ్రామంలో భూ సమస్యల మీద 10 అర్జీలు వచ్చాయన్నారు, వచ్చినటువంటి అర్జీలను పరిష్కరిస్తామని తాసిల్దార్ అన్నారు, కార్యక్రమంలో ఎంపీపీ అన్నపూర్ణ రావు, సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, మండల సర్వేయర్ శకుంతల, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్,వీఆర్వో అరుణ, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## కాలువలో కారు బోల్తా

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

కోట మండలం తిన్నెలపూడి బ్రాంచి కాలువ సమీపంలోని వంట కాలువలో శుక్రవారం రాత్రి ఓ కారు బోల్తాపడింది. అయితే కారులో ఉన్న వ్యక్తి ఎలాంటి గాయాలు కాలేదు. ఎయిర్‌బెలూన్లు ఓపెన్ కావడంతో వెంటనే ప్రమాదం నుంచి కారులో ఉన్న వారు బయటపడ్డారు. కారును శనివారం క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఏర్పాటు

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

కోటలోని దళితవాడలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు మీజూరు మాధవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా కోటలో 50 మందితో కమిటీ ఏర్పాటైనట్లు పేర్కొన్నారు. కమిటీలో 90 శాతం యువతకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. గౌరవ సలహాదారులుగా మర్రి పోలయ్య, చంద్రయ్య, నవకోటి బాబూరావు, అధ్యక్షుడిగా పేర్నాటి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఆర్గనైజర్‌గా పాల మల్లికార్జునరావు, గురుప్రసాద్, ప్రవీణ్, కోటేశ్వరరావు, డిసిప్లైనరి కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్లు, శీను, చిరంజీవి, గిరిబాబు, ఉమా, మహేష్, రాయపు మస్తానయ్య, భాస్కర్, బాలాజీ, నాగార్జున, మహిళా విభాగం నుంచి దేవిక, మీడియా ఆర్గనైజర్‌గా ఎంబేటి జగదీష్ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమంత్‌కుమార్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తి చేయండి

సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులో గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదరన్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరగడంతో నిత్యం రద్దీగా ఉండే సూళ్లూరుపేట పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అలాగే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపేయడంతో దానికి ఉపయోగించేందుకు తయారు చేసిన స్ట్రక్చర్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతానికి స్ట్రక్చర్స్ పక్కకు జరిపి ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించాలని అసోసియేషన్ వారు విజ్ఞప్తి చేశారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో తూర్పువైపున ఉన్న ప్రజలకు అనుకూలంగా లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌కు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆదిశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే అందరికీ ఉజ్వల భవిష్యత్తు

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త



విద్యతోనే అందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. వెంకటగిరి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల తల్లి దండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫై టీచరు ఉంటారని ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫై అయిన వారు ఉండరని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని తెలిపారు. పిల్లలు బాగా చదువుతున్నారా లేదా అని కూడా పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందా లేదా అని విద్యార్థులను అడిగారు. సమావేశంలో ప్రత్యేక అధికారి ప్రసాద్ రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు సిఐ ఏవి రమణ ,తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం



సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యషష్టి పర్వదినం సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని శనివారం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో సుబ్రహ్మణ్య స్వామి, వల్లీ దేవసేన విగ్రహాల వద్ద స్వామివారి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి దంపతులు దగ్గరుండి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలతో ప్రారంభమై మధ్యాహ్నం కల్యాణోత్సవంతో ముగిసింది. దేవస్థానం ప్రధాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## గూడూరుకి తలమానికంగా సిద్ధార్థ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

### ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్



గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు పట్టణానికి తలమానికంగా సిద్ధార్థ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిలవాలని తాను ఆశిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు . గూడూరు రెండో పట్టణ పరిధిలో పారిశ్రామికవేత్త తలమంచి సిద్ధారెడ్డి కుమారుడు డాక్టర్ వినోద్ కుమార్ రెడ్డి లక్ష్మి సుధా దంపతులచే నిర్మించిన సిద్ధార్థ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. గూడూరు రెండో పట్టణంలో నూతనంగా నిర్మించిన సిద్ధార్థ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్ హాస్పిటల్ లో ఉన్న వసతులను పరిశీలించి అక్కడ అందుబాటులో ఉండే వైద్య సౌకర్యాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు సి జనార్దన్ రెడ్డి, రోహిణి, మైథిలి, ప్రముఖులు పారిశ్రామికవేత్తలు బొమ్మిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, నాయకులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, కోడూరు వీరారెడ్డి బిల్లు చెంచు రామయ్య పులిమి శ్రీనివాసులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి చదలవాడ హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయండి

### సిపిఐ, ఇన్సాఫ్ నాయకులు పురపాలక శాఖ కమిషనర్‌కి వినతి

గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో గత రెండు వారాలుగా విష జ్వరాలు విపరీతంగా పెరిగి ప్రజలు అవస్థలు పడుతున్నారని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని పురపాలక శాఖ కమిషనర్ కు శనివారం వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు తీవ్రంగా ప్రబలి ప్రతి ఇంట్లో జ్వరపీడితులు ప్రబలుతున్నాయన్నారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందన్నారు. కుక్కలు గుంపులుగా చేరి పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయన్నారు. అలాగే భూగర్భ గ్యాస్ పైప్ లైన్ కోసం తవ్విన గుంతలను పలు చోట్ల పూడ్చలేదన్నారు. దీంతో వాహనదారులు రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారన్నారు. పెద్ద మసీదువీధి, సత్రపువీధి, సాధుపేట సెంటర్ తదితర ప్రాంతాల్లో గుంతల వలన నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆయా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫాగింగ్ మెషీన్లు కొనుగోలు చేశామని, రెండు, మూడు రోజుల్లో పట్టణంలో ఫాగింగ్ చేస్తామన్నారు. కుక్కల బెడదను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఎంబేటి చంద్రయ్య, ఆల్ ఇండియా తన్జీమ్ ఏ ఇన్సాఫ్ ఏపీ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ షేక్ జమాలుల్లా, నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఇలియాజ్ (మున్నా), ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, యశ్వంత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అబివృద్దే ప్రభుత్వ లక్ష్యం ...ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, డిసంబరు 07 ప్రభాతవార్త;

గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అబివృద్ది చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు.ఆమె శనివారం నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఏ సాగరం ప్రాథమిక ఉన్నత పాఠవాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశానికి ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు.ఈసందర్బంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లడుతూ ప్రభుత్వం పాఠశాలలను అబివృద్ది చేసేందుకు ఎంతగానో కృషిచేస్తుందని ఆమె తెలియజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం,మాజీ ఏఎంసి చేర్మేన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి,చ ంద్రారెడ్డి,తదితర తెదేపానాయకులు,ఉపాద్యాయులు,విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## టైనీటాట్స్ అధినేతకు ట్రైల్ బ్లేజర్ అవార్డు

సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త




సూళ్లూరుపేటలోని టైనీటాట్స్ ఎడ్యుకేషనల్ అకాడమి అధినేత వేనాటి ధనుంజయరెడ్డి ట్రైల్ బ్లేజర్ అవార్డును అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రతన్ టాటా కన్వెన్షన్ హాలులో ఈటెక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈటెక్స్ సంస్థ బ్రెయిన్ ఫీడ్ సొసైటీ జరిపిన సర్వేలో దేశవ్యాప్తంగా విచ్చేసిన స్కూళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన టాప్ టెన్ స్కూళ్లలో సూళ్లూరుపేటలోని టైనీటాట్స్ ఎడ్యుకేషనల్ అకాడమి ఎంపికైంది. ఈ అవార్డును బ్రహ్మం టాలెంట్ స్కూల్ అధినేత శ్రీబ్రహ్మం సమక్షంలో ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా వేనాటి ధనుంజయరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

## పండుగ వాతావరణంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త




కోట మండలంలోని 73 ప్రాథమిక పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులతో సమావేశాలు నిర్వహించారు. కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఇఓ మస్తానయ్య, ఎస్ఐ పవన్‌కుమార్, టిడిపి నాయకులు జలీల్ అహ్మద్, ఎంపిటిసి షంషద్దిన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తిన్నెలపూడిలోని యూపి స్కూల్లో టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సుష్మారెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

## తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ...శివనారాయణ

నాయుడుపేట, డిసంబరు 7 ప్రభాతవార ్త

గ్రామాల్లో రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాదించే విధంగా నూతన సాంకేతిక పరిజా ్ఞంతో వ్యవసాయంను సాగుచేపట్టాలని నెల్లూరు ఆత్మప్రాజెక్ట్ డైరెక్టర్ శివనారాయణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం నాయుడుపేట ఐసిడిఎస్ సమావేశ మందిరంలో గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట,నాయుడుపేట డివిజన్ పరిదిలోని రైతుసేవా కేంద్రాల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార ్యక్రమం నిర్వహించారు. అనంతరం నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వినీత మాట్లడుతూ వరిసాగులో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్దతుల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కల్పించారు.ఈకార్యక్రమంలో ఏడిఏ సుచేంద్ర ప్రసాద్,ఎవో గణేష్,వాకాడు ఎవో దీప,దొరవారిసత్రం ఎవో జ్యోతిర్మయి,జిల్లాకేంద్ర వ్యవసాయశాఖ అధికారులు వేణుగోపాల్‌రావు,శశిధర్‌రెడ్డి,తదితర సిబ్బంది పాల్గోన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. రెండవ రోజు శనివారం మండల పరిధిలోని గూడలి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా ఆన్‌లైన్‌లో సిబ్బంది అర్జీలు నమోదు చేస్తున్న తీరును తహశీల్దార్ పరిశీలించారు. గ్రామంలో 11 మంది పలు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపీరెడ్డి, విఆర్ఓలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండలం పెరివరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూ సమస్యలను ఈ సదస్సులో అక్కడికక్కడే పరిష్కరిస్తారని చెప్పారు. గత ప్రభుత్వంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. భూ సమస్యలు ఉంటే ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. వరవకాలవ ఆక్రమించారని పలు భూ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. సదస్సు నోడల్ ఆఫీసర్ ప్రసాద్ రావు ఆర్ ఐ రాజేష్ సర్వేయర్లు సుప్రజా మురళి విఆర్ఓ శ్రీనివాసులు జనసేన నాయకులు చిరంజీవి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కే వి కే ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడి వైపు ఒక అడుగు కార్యక్రమం



చిల్లకూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పెద్దలు ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ పెంచలకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీ సూచనల మేరకు చిల్లకూరు మం డలం ఒడూరు గ్రామం ఎంపియుపి స్కూల్ నందు ప్రభుత్వం చేపట్టిన పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడి వైపు ఒక అడుగు కార్యక్రమంలో భాగంగా పాఠశాల నందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం లో పాల్గొని, ముగ్గులు పోటీలు

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న"



చంద్రగిరి, డిశంబర్ 7 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్లతో మందులు పిచికారి చేస్తున్నాం

### కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 7, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో దోమల లార్వాలను నాశనం చేయడానికి మనుషులు వెళ్ళడానికి వీలు లేని ప్రాంతాల్లో డ్రోన్లతో మందులను పిచికారి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని నారాయణపురం వద్ద శనివారం డ్రోన్లతో మందులను పిచికారి చేసే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతున్నాయని అన్నారు. వాటిని నివారించేందుకు మందులను స్ప్రే చేస్తున్నామని అన్నారు. మనుషులు వెళ్లలేని నీటి కుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. నారాయణపురం వద్ద మురుగునీరు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ మందులు పిచికారీ చేస్తున్నామని అన్నారు. నగరంలో అధికారులు గుర్తించిన దోమల వృద్ధి ఎక్కువగా 32 ప్రాంతాల్లోని 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు.

## సర్పంచ్...రెండు పడవులపై ప్రయాణం ప్రమాదకరం





తిరుపతిరూరల్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు భిన్నంగా వ్యవహరిస్తూ అందరి దృష్టిలో పడుతున్నారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నానితో పోటీపడి ఫోటోలు దిగిన విషయం తెల్సిందే. అయితే శనివారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని, దుశ్శాలువతో ఘనంగా సత్కరించి ఫోటో దిగారు. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో భోజనం చేసారు. ఈ సర్పంచ్‌ల తీరు చూసి మండల ప్రజలుహావ్వరా అంటూ ముక్కుమీద వేలు వేసుకొని చర్చించుకొంటున్నారు. అవిలాల, పద్మావతిపురం, ఓటేరు, కె.సి.పేట, సాయినగర్, లింగేశ్వర్‌నగర్ చెందిన సర్పంచ్‌లు తీరు ఇది!

## వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాన మహోత్సవం

పాకాల, డిసెంబర్ 7, ప్రభాతవార్త





పాకాల మండలం ఊట్లవారిపల్లె ఆనందగిరి కొండపై వెలసివున్న శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామికి, మార్గశిర మాసం శుక్లపక్షమన వచ్చే షష్టి సందర్భంగా స్వామి వారికి శనివారం 10.30 మకర లగ్నమందు 12.30 మధ్య కన్నుల విందుగా కల్యాణోత్సవం జరిగింది. ఆలయ ఛైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, మరియు ఈవో ఉషారాణి, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి ఊరేగింపు ఆద్యంతం పుర వీధుల్లో వైభవంగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

### టీచర్లకు మాజీ ఎంపిపి సూచన



పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పుత్తూరు మాజీ ఎంపిపి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. శనివారం మండలంలోని పరమేశ్వరమంగళం ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లితండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మూడు దశాబ్దాల క్రితం ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా లేని రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో అనేక మంది ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో వున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు తరచూ తల్లితండ్రులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యార్థుల అభ్యాసన శక్తిపై వారితో చర్చిస్తే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం వుందన్నారు. తల్లితండ్రులు కూడా తమ చుట్టుపక్కల వారికి ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సదుపాయాలను వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తోడ్పడాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడం గొప్పగాను, ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం నామోషీగాను తల్లితండ్రులు భావిస్తున్నారని ఈ వైఖరిని విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ శెట్టి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎ.బాలాజీ, జయకర్, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న సినీ హీరో సుహాస్



కాణిపాకం, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ప్రముఖ సినీ హీరో సుహాస్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.